

జిల్లా స్థాయి క్విజ్ పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - సంబేపల్లి (రాయచోటి)

ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీలలో సంబేపల్లి హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం సంబేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో నిర్వహించిన ఈ క్విజ్ పోటీలలో పాఠశాలకు చెందిన రుక్సానా, ఆఫ్రా, మౌనిక, నిఖిల్, పాజిల్ లు మంచి ప్రతిభ చూపారన్నారు. కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ ప్రతినిధి లక్ష్మయ్య, పాఠశాల కోఆర్డినేటర్ రెడ్డి శేఖర్, రామయ్య, తదితరులు పాల్గొన్నారు.



క్విజ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

- నిరసనలో వామపక్ష నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌పై రాజ్యసభలో అవమానకరమైన, అప్రతిష్ఠాకరమైన వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా రాజీనామా చేయాలని కోరుతూ సోమవారం దేశవ్యాపితంగా వామపక్ష పార్టీల నిరసనల్లో భాగంగా మదనపల్లి పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద వామపక్ష పార్టీల ఆధర్యంలో నిరసన, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ రాజ్యసభలో అంబేద్కర్‌పై చేసిన అవమానకరమైన వ్యాఖ్యలపై దేశ వ్యాపితంగా ఆగ్రహావేశాలు పెల్లుబికినా, నిరసనలు వెల్లువెత్తినా అమిత్‌షా గానీ, ప్రధాని నరేంద్ర మోడీ గానీ ఇందుకు బాధ్యత వహించడం కానీ, దిద్దుబాటు చర్యలు చేపట్టేందుకు కానీ సిద్ధపడకపోవడం దారుణమన్నారు. అమిత్‌షాకు రాజ్యాంగం మీద గానీ, అంబేద్కర్ మీద గానీ గౌరవం లేదని తెలిపారు. అందుకే అంబేద్కర్ పట్ల ఆయన అగౌరవంగా మాట్లాడారన్నారు. అమిత్‌షాను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. దేశానికి మనువాద మతోన్మాద భావజాలం ప్రమాదకరంగా మారిందన్నారు. దీనికి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో దళిత, గిరిజన, మహిళలపై దుర్మార్గమైన దాడులు, అవమానాలు జరుగుతున్నా ఏమాత్రం మాట్లాడని ప్రధాని మోడీ, అమిత్ షాను వెనుకేసుకురావడం దుర్మార్గమన్నారు. ఈ తరహా ధోరణులు పెత్తం దారీ పోకడలు రాజ్యాంగ సూార్తికి విరుద్ధమన్నారు. రాజ్యాంగ బద్ధంగా లభించిన కేంద్ర హోంశాఖ మంత్రి పదవి నుంచి అమిత్ షా తప్పుకోవాలని హితవుపలికారు. సిపిఎం నాయకులు హరినాథ్ శర్మ, నరసింహ, సిపిఐ నాయకులురెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోడీకి చిత్తశుద్ధి ఉంటే రాజ్యాంగ పితామహుడు అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను శిక్షించవలసిన అవసరం లేదా అని ప్రశ్నించారు. రాజ్యాంగంపై, అంబేద్కర్‌పై మోడీకి గౌరవం ఉంటే అమిత్‌షాను బర్తరఫ్ చేయాలన్నారు. మనుధర్మాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో అంబేద్కర్ నామాన్ని స్మరించవద్దని అమిత్‌షా పార్లమెంట్‌లో చెప్పడం అత్యంత దుర్మార్గమన్నారు. అమిత్‌షా, ప్రధాని మోడీ దేశ సంపదను అంబానీ, అదానీలకు దోచిపెడుతున్నారని విమర్శించారు. మనుధర్మం, కుల ధర్మాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగరాజు, రాజబాబు, రమణ, ఆఫ్రిద్, లతీఫ్, సిపిఐ నాయకులు తిరుమల, దేవా, ఆటో యూనియన్ నాయకులు అంజాద్, ప్రసాద్, గంగులప్ప పాల్గొన్నారు. **రాయచోటి టౌన్ :** చట్టసభలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్‌ను అవమానకర రీతిలో మాట్లాడిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను వెంటనే పదవి నుండి తొలగించి అరెస్ట్ చేసే వరకు దశలవారీ నిరసన కార్యక్రమాలు చేస్తామని వామపక్షపార్టీల, ప్రజా సంఘాల నాయకులు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు చట్టాల వల్ల పదవులు అనుభవిస్తూ నేడు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను విస్మరిస్తూ అగౌరవపరచడం తల్లి పాలు తాగి రొమ్ము గుద్దడమే నన్నారు. మణిపూర్‌లో మహిళల మీద క్రూరమైనదాడులు చేస్తే స్పందించని అమిత్‌షా, అంబేద్కర్ గురించి మాట్లాడడం మోడీ మౌనంగా ఉండడం ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందా అనుమానం ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగ రక్షణకు భవిష్యత్‌లో ప్రజలను చైతన్యపరిచి మనువాదులకు శాస్త్రీయ పద్ధతిలో గుణపాఠం చెబుతామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నర్సింహులు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామానుజులు, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా నాయకులు మావులూరి విశ్వనాథ్, సిపిఎం నాయకులు మాధవయ్య, డిసి.వెంకటయ్య, బసిరెడ్డి, ఎంఆర్‌పిఎస్ నేత రామానుజులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు, విశ్వనాథ్ నాయక్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి సుదీర్ కుమార్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రంగారెడ్డి, రమణ పెద్దన్న పాల్గొన్నారు.



మదనపల్లె : ధర్నా చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు



రాయచోటి : కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

'అభివృద్ధికి అంగవైకల్యం అడ్డురాదు'

ప్రజాశక్తి - రాయచోటి

విభిన్న ప్రతిభావంతుల అభివృద్ధికి అంగవైకల్యం అడ్డు రాకూడదని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్‌లో అన్నమయ్య జిల్లాకు చెందిన ఇద్దరు విభిన్న ప్రతిభావంతులకు ఉప ముఖ్యమంత్రి వర్చువల్‌గా, కలెక్టర్ శ్రీధర్ చామకూరి చేతుల మీదుగా ఉచిత స్కూటర్లను పంపిణీ చేశారు. లక్కిరెడ్డిపల్లి మండలం కాపుపల్లి గ్రామానికి చెందిన కట్ట ఆదినారాయణకు, అదే మండలం వేములవాండ్లపల్లి గ్రామానికి చెందిన కాల్వ చంద్రశేఖర్‌కు రూ. 2లక్షలు విలువ చేసే రెట్రో ఫిటెడ్ మోటర్ స్కూటర్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ కలెక్టర్ ఎంతో చొరవ చూపి తన సొంత బడ్జెట్ నుంచి రూ.2 లక్షలు వాహనాలను కొని లబ్ధిదారులకు అందజేయడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. విభిన్న ప్రతిభావంతులకు అందించిన ఈ స్కూటర్ల ద్వారా వారికి ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. ఇది చాలా చిన్న ఉపశమనమే అయినప్పటికీ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. తనకు స్టీఫెన్ హాకింగ్, జోషి లాంటి విభిన్న ప్రతిభావంతులు ఎంతో స్ఫూర్తిని కలిగిస్తారని వారి నుంచి మనం ఎంతో నేర్చుకోవాలని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి తన పెద్ద మనసును చాటుకోవడం ద్వారానే ఇంత మంచి కార్యక్రమాన్ని చేయగలిగామని పేర్కొన్నారు. ఇంత మంచి కార్యక్రమంలో తాను భాగస్వామిని అయినందుకు ఎంతో ఆనంద పడుతున్నానని పేర్కొన్నారు. సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి, ౕలెక్టర్ చేసిన మేలును ఎప్పటికీ మరిచిపోలేమని, వారికి జీవితాంతం రుణపడి ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, విభిన్న ప్రతిభావంతుల శాఖ జిల్లా అధికారి కృష్ణ కిషోర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ వంద శాతం పూర్తి చేయాలి

ప్రభుత్వం ఆదేశాల మేరకు డిసెంబర్ 31న జిల్లాలో వంద శాతం సామాజిక పింఛన్ల పంపిణీని సజావుగా పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్ హాలు నుంచి జిల్లా అధికారులు, సబ్ కలెక్టర్లు, ఆర్‌డిఒ, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మండల స్థాయి అధికారులతో వివిధ అంశాలలో వర్చువల్‌గా సమావేశం నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 31న వందశాతం పింఛన్ల పంపిణీ సక్రమంగా చేయాలన్నారు. లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు ఇవ్వాలన్నారు. పింఛనుదార్లు అందుబాటులో ఉండాలని అవగాహన కలిగేలా టామ్ టామ్ వేయాలన్నారు. మంగళవారం ఉదయం 5.30 నుంచి పింఛన్ పంపిణీ చేసే సిబ్బంది క్షేత్రస్థాయిలో కార్యక్రమాన్ని ప్రారంభించాలని సూచించారు. మండలాల వారీగా మిస్సింగ్ సిటిజన్స్ అంశంలో ప్రగతిపై సమీక్షించారు. ప్రగతిలో వెనకబడిన మండలాల అధికారులను కారణాలు అడిగి తెలుసుకుని తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు జారీ చేశారు. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులపై ఎవరైనా అనుచితంగా ప్రవర్తించిన, దాడులు చేసినా చట్టపకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. వీలైతే బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే వారిపై ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే వెంటనే సంబంధిత సబ్ కలెక్టర్లు, హెచ్‌ఒడి ద్వారా కలెక్టరు దృష్టికి తీసుకురావాలన్నారు. అన్ని కార్యాలయాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆయా మండలాలలో రెవెన్యూ సదస్సులు పటిష్ఠంగా నిర్వహించాలని తహశీల్దార్లకు సూచించారు. సదస్సుల్లో వచ్చిన పిటిషన్లను కనీసం రోజుకు 5 చొప్పున తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పిజిఆర్ఎస్, సిఎంఒ ఫిర్యాదలను వేగంగా పరిష్కరించాలని చెప్పారు. ప్రాథమిక వ్యవసాయ కో-ఆపరేటివ్ సొసైటీలో వందశాతం ఇకెవైసి పూర్తి చేయాలని సంబంధిత మండల అధికారులను ఆదేశించారు. జిల్లా గ్రామ సచివాలయ అధికారులు తగువిధంగా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు, సబ్ కలెక్టర్లు, ఆర్‌డిఒ, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



విభిన్నప్రతిభావంతులకు వాహనాలు అందిస్తున్న కలెక్టర్ శ్రీధర్

పంచాయతీ రాజ్ వ్యవస్థపైనే దాడి

- ఎంపిడిఒను పరామర్శించిన రాజేంద్రప్రసాద్



కడప రిమ్స్‌లో ఎంపిడిఒను పరామర్శిస్తున్న రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి-కడప అర్బన్

గాలివీడు ఎంపిడిఒ జవహర్‌బాబుపై దాడిచేయడమంటే పంచాయతీ రాజ్ వ్యవస్థలపైనే దాడిచేయడమని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వై.వి.బి.రాజేంద్రప్రసాద్ అన్నారు. సర్పంచ్‌ల సంఘం, పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర కమిటీ నాయకులతో కలసి గాలివీడు మండల పరిషత్ కార్యాలయంలో వైసిపి నాయకుల చేతిలో దాడికి గురై రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎంపిడిఒ జవహర్ బాబును సోమవారం పరామర్శించి ధైర్యం చెప్పారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయమని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రాజేంద్రప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ ఎంపిడిఒలు అంటే పంచాయతీ రాజ్ ఛాంబర్‌లో ఒక భాగమని అందుకనే ఎంపిడిఒపైన జరిగిన దాడిని మొత్తం పంచాయతీ రాజ్ వ్యవస్థపైనే జరిగిన దాడిగా భావిస్తూ ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఏ అధికారి కూడా ఇటువంటి పరిస్థితి రాకుండా చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని కోరారు. దాడి చేసిన నిందితుడు సుదర్శన్‌రెడ్డికి మద్దతుగా బద్వేల్‌లో లాయర్లు చేసిన నిరసన హాస్యాస్పదమని పేర్కొన్నారు. లాయర్ పట్టాతో పాటు రౌడీయిజం పట్టా ఏమైనా పొందారా మీరు, లాయర్లైతే ఎవరినైనా కొడతారా, అటువంటివారిని మందలించేది పోయి మద్దతుగా నిలుస్తారా అని సూటిగా ప్రశ్నించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కొత్తపు మునిరెడ్డి, జల్లు కొండయ్య, సింగంశెట్టి సుబ్బరామయ్య, చిత్తూరు జిల్లా పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనుంజయ యాదవ్, సర్పంచ్ల సంఘం రాష్ట్ర కార్యదర్శులు భూమా గోపాల్‌రెడ్డి, పార్థసారథిరెడ్డి, యనమల సుధాకర్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ, పంచాయతీ రాజ్ ఛాంబర్, సర్పంచ్‌ల సంఘం నాయకులు చింత కిరణ్ యాదవ్, కుప్పాల సుబ్బయ్య, సంగటి గంగిరెడ్డి, లక్ష్మీనారాయణ, ప్రభాకర్‌రెడ్డి, నాగార్జున ఆచారి, రామాంజనేయరెడ్డి, మహేష్, నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

విద్యారంగ సమస్యల పరిష్కారమే అంతిమ లక్ష్యమని ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు నరసింహ, రమణ అన్నారు. సోమవారం స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా మొదటి మహాసభలు మదనపల్లి పట్టణంలో రెండు రోజులపాటు నిర్వహించామన్నారు. విద్యారంగ సమస్యల పైన చర్చించి భవిష్యత్తుకు కార్యాచరణ రూపొందించామన్నారు. విద్యారంగంలో ఉన్న సమస్యలన్నింటిపై భవిష్యత్తులో పోరాటాలు చేయాలని తీర్మానించామని పేర్కొన్నారు. జిల్లాలో ప్రతి మండలానికి ఒక జూనియర్ కళాశాల నియోజకవర్గంలో పాలిటెక్నిక్ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. రాయచోటి, కోడూరు, మదనపల్లి ప్రాంతాలలో ప్రభుత్వ ఐటిఐ కళాశాలలు నిర్మించాలని డిమాండ్ చేశారు. మదనపల్లిలో ఉన్న మెడికల్ కళాశాలను ప్రభుత్వ ఆధ్వరంలోనే నిర్వహించాలని బిటి కళాశాలకు పూర్వ వైభవం తీసుకొచ్చి యూనివర్సిటీని చేయాలని కోరారు. సంక్షేమ హాస్టల్ కళాశాలకు సొంత భవనాలు నిర్మించాలని శిథిల వ్యవస్థలో ఉన్న సంక్షేమ హాస్టలకు మరమ్మతులు చేసి విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన జీవో నెంబర్ 77,117,118 వెంటనే రద్దు చేయాలని కోరారు. భవిష్యత్తు కర్తవ్యాల పైన అన్నమయ్య జిల్లాలో నూతన నాయకత్వం పోరాటాలకు పిలుపునిచ్చామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహ

నూతన కమిటీ ఎన్నిక..: ఎస్ఎఫ్ఐ నూతన జిల్లా కమిటీ 17 మందితో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా నరసింహ, జిల్లా కార్యదర్శిగా డి.వి.రమణ, ఉపాధ్యక్షుడిగా మదన్మోహన్‌రెడ్డి, రాజంపేట ఉపాధ్యక్షుడిగా లతీఫ్ సహాయ కార్యదర్శులుగా ఆఫ్రిద్, మదనపల్లి సహాయ కార్యదర్శులుగా గురునాథ్, రాయచోటి జిల్లా కమిటీ సభ్యులుగా జయ బాబు, గిరి, జస్వంత్, ప్రశాంత్, చందు, ఆదర్శను ఎన్నుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు

నేరాల నియంత్రణకు చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ప్రజల రక్షణతో పాటు నేరాల నియంత్రణకై పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారని ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో 2024 వార్షిక సమావేశాన్ని నిర్వహించారు. 2024వ సంవత్సరంలో పరిధిలో జరిగిన నేరాలులు, రికవరీలు, నేరస్థుల అరెస్టులకు సంబంధించి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు పోలీసులు సహకారంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రాపర్టీ నేరాలు, అఘాయిత్యాలు, మొబైల్ ఫోన్ల చోరీ, కిడ్నాప్ తదితర నేరాలు జరుగకుండా నిఘా ముమ్మరం చేసినట్లు తెలిపారు. నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన మరిన్ని జాగ్రత్త చర్యలతో ముందుకు వెళ్తామన్నారు. ప్రజల సమస్యలను అలాగే వారి రక్షణ కల్పించడంతో పాటు నేరాలను అదుపు చేసేందుకు పోలీసులు ఎనలేని కృషి చేస్తు న్నారని వెల్లడించారు. ఈ సందర్భంగా 2024 సంవత్సరంలో జరిగిన నేరాలు, రికవరీలకు సంబంధించిన వివరాలు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎం.వెంకటాద్రి, రాయచోటి, మదనపల్లి, రాజంపేట డిఎస్‌పిలు ఎం.ఆర్.కృష్ణ మోహన్, డి.కొండయ్య నాయుడు, ఎస్.సుధాకర్, ఎస్‌బి సిఐలు, పి.రాజారమేష్, ఎ.సత్యనారాయణ, కె.రాజారెడ్డి, డిసిఆర్‌బి సిఐ ఎం.తులసిరాం పాల్గొన్నారు.

నూతన సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు అవసరం

ప్రజాశక్తి-మదనపల్లి

విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని బెంగళూరు వెల్స్‌ఫార్గో సీనియర్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ సమీవుల్లా అన్నారు. మిట్స్ కళాశాలలో ఎంసిఎ విద్యార్థులకు పేరెంట్స్ మీట్‌ను ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సమీవుల్లా మాట్లాడుతూ నూతన టెక్నాలజీ ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్, డేటా సైన్స్, బ్లాక్‌చైన్‌పై పట్టు సాధించాలన్నారు. విద్యార్థులు పరీక్షలే కాకుండా వీటిపై పట్టు సాధించాలని తెలిపారు. ప్రతి కంపెనీలో ప్రస్తుతం నూతన టెక్నాలజీలో ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ జరుగుతున్నదని, విద్యార్థులు ముందుగా ఇంటర్వ్యూలలో అడిగే ప్రశ్నలపై పట్టు సాధించాలని పేర్కొన్నారు. మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగం విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రుల మధ్య బలమైన బంధాన్ని పెంపొందించడానికి ఈ తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కల్పన పేర్కొన్నారు. విద్యార్థులకు వివిధ మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందుబాటులో ఉన్నాయని వాటిపై అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ నవీన్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఔషధాల నాణ్యత నిర్ధారణ పరికరంపై వర్క్‌షాప్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్: స్థానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో ఎటిఆర్-ఎఫ్‌టిఐ ఆర్ స్పెక్ట్రాకాపీ అను పరికరంపై వర్క్‌షాప్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత తెలిపారు. ఈ వర్క్‌షాప్ కార్యక్రమం కళాశాల ఫార్మాసూటికల్ అనాలసిస్ విభాగం వారు ఐక్యూ ఎపి విభాగం వారితో కలిసి విద్యార్థులకు ఔషధ నాణ్యత నిర్ధారణ అను అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ వర్క్‌షాప్‌లో విద్యార్థులకు పరికరాన్ని ఉపయోగించే విధానం నేర్పారు. ఉపయోగించిన తర్వాత వచ్చే సమాచారాన్ని విశ్లేషించి ఔషధ లక్షణాలను కనుగొనుటకు ఈ పరికరం ఉపయోగపడుతుందని ఎం.మధు, ఎ.సుస్మిత విద్యార్థులకు బోధించారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంపై కళాశాల కార్యదర్శి డాక్టర్ సి.గంగిరెడ్డి, కోశాధికారి సి.అభిషేక్ రెడ్డి, వైస్ చైర్మన్ సి.ఎల్లారెడ్డి, చైర్మన్ డాక్టర్ సి.రామచంద్ర రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

నాణ్యతే ప్రామాణికంగా సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి-రాయచోటి

నాణ్యతే ప్రామాణికంగా పిజిఆర్ఎస్ సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెకర్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు డిఆర్‌ఒ కె. మధుసూదన్ రావు, ఎస్‌డిసి రామసుబ్బయ్య ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో నాణ్యతే ప్రామాణికం కావాలన్నారు. అర్జీదారుల సమస్యలను అత్యంత నాణ్యతగా పరిష్కరించినప్పుడే ప్రజలకు మనపై విశ్వాసం కలుగు తుందన్నారు. ఈ సందర్భంగా దరఖాస్తులు ఎన్ని వచ్చాయి, ఎప్పుడు వచ్చాయి, ఫీల్డ్‌కు వెళ్ళారా, విచారణ చేశారా, నోటీసులు ఏమైనా ఇచ్చారా, తదుపరి ఎలాంటి చర్యలు తీసుకున్నారన్న అంశాలలో అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. బియాండ్ ఎస్ఎల్ఎ పరిధిలోకి ఎట్టి పరిస్థితుల్లో అర్జీలు వెళ్లకుండా ఎప్పటికప్పుడూ తగిన చర్యలు తీసుకొని పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులను ఆయా మండల తహశీల్దార్లు, డివిజన్ స్థాయిలో ఆర్‌డిఒలు ప్రాధాన్యతగా పరిష్కరించాలన్నారు.



హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రాణ రక్షణకు శిరస్త్రాణమే రక్ష : సిఐ

ప్రజాశక్తి-పీలేరు

ద్విచక్ర వాహనదారుల ప్రాణరక్షణకు శిరస్త్రాణం రక్షనని, ప్రతి ఒక్కరూ హెల్మెట్ వాడాలని పీలేరు సిఐ యుగంధర్ తెలిపారు. ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు, రాయచోటి డిఎస్‌పి కృష్ణమోహన్ ఆదేశాల మేరకు సోమవారం పీలేరు పోలీసుల ఆధ్వర్యంలో హెల్మెట్, సీట్ బెల్ట్‌ల ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తూ నిర్వహించిన బైక్ ర్యాలీని సిఐ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ వాడాలన్నారు. హెల్మెట్ వాడని ఫలితంగా రోడ్డు ప్రమాదాల్లో చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను, కార్లలో ప్రయాణిస్తున్న వారు సీట్ బెల్ట్‌లను తప్పనిసరిగా ధరించాలని తెలియజేశారు. ప్రమాదాలబారిన పడుతున్న ద్విచక్ర వాహనదారుల్లో చాలా వరకు ప్రాణ నష్టం జరుగుతున్నదని తెలియజేశారు. ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ, వాహనాన్ని నడిపేవారితో పాటు వెనుక కూర్చున్న వ్యక్తి సైతం తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అనంతరం అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సైలు బాలకృష్ణ, లోకేశ్వర్ ఉత్తమ సిబ్బందితో కలిసి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

కుల రాజకీయాలు వైసిపికే చెల్లు : టిడిపి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ విమర్శించారు. సోమవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కులరాజకీయాలు వైసిపికే చెల్లుతాయని, కూటమి ప్రభుత్వానికి అన్నివర్గాలు సమానమేనన్నారు. గత వైసిపి ఉమ్మడి చిత్తూరు జిల్లాలకు చెందిన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామికి కనీసం స్టేజి మీద కూడా కుర్చీ ఇవ్వకపోవడం, దళిత డాక్టర్ సుధాకర్‌పై దాడి చేసి అవమానించిన ఘటనలు ఎంపీకి గుర్తు లేవా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ పాలనలో ఎర్రచందనం స్మగ్లరుగా పేరుగాంచిన వైసిపి నాయకులు బాబ్‌జాన్ నివాసంలో ఎంపీ పాత్రికేయుల సమావేశం నిర్వహించి తన స్థాయిని దిగజార్చుకున్నారన్నారు. రాయలసీమ వాసుల చిరకాల ఆకాంక్ష అయిన కడప-పెండ్లిమర్రి-మదనపల్లి- బెంగళూరు రైల్వే లైనును పక్కదారి పట్టించిన సమయంలో మిథున్‌రెడ్డి ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. కార్యక్రమంలో రాచవేటివారిపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున, మాజీ ఎంపిటిసి నరసింహులు, శంకర, వెంకటరమణ పాల్గొన్నారు.

'న్యాయవాది మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి'

ప్రజాశక్తి-రాయచోటి

అనంతపురం బార్ అసోసియేషన్‌కు చెందిన సీనియర్ న్యాయ వాది శేషాద్రి మృతిపై సిట్టింగ్ జడ్జితోన్యాయ విచారణ జరిపించి ఆయన మృతికి కారణమైన అనంతపురం త్రీ టౌన్ సిఐ శాం లాల్ ను ఉద్యోగం నుంచి తొలగించాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. సోమవారం న్యాయవాదులు రాయచోటి కోర్టు విధులను బహిష్కరించి సిఐ శాంతి లాల్ చర్యకు నిరసనగా కోర్టు గేటు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.రెడ్డయ్య, సహాయ కార్యదర్శి డి.నాగముని మాట్లాడుతూ ఒక సివిల్ కేసు విషయంలో న్యాయవాది శేషాద్రిని శనివారం రోజున అనంతపురం త్రీ టౌన్ సిఐ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి దండించినందున తీవ్ర మనస్థాపానికి గురైన న్యాయవాది శేషాద్రి సిఐ ఛాంబర్‌లోనే గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతిచెందారని చెప్పారు. న్యాయవాది వెంట వెళ్లిన జూనియర్ న్యాయవాదులను కూడా పోలీస్ స్టేషన్‌లోకి అనుమతించకుండా అత్యంత క్రూరంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. సివిల్ కేసుల్లో పోలీసుల జోక్యం వద్దని సుప్రీంకోర్టు పదేపదే చెబుతున్నప్పటికీ సిఐశాంతి లాల్ మాత్రం ఒక సీనియర్ న్యాయవాది అని కూడా చూడకుండా ఫోన్లు చేసి పోలీస్ స్టేషన్‌కు పిలిపించి అమర్యాదిగా ప్రవర్తించడం వల్ల ఈ దారుణ సంఘటన చోటు చేసుకుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సివిల్ కేసుల్లో స్టేషన్‌కు పిలిపించడం చట్ట విరుద్ధమైన పంచాయితీలు నిర్వహించడం, వినకపోతే బాధితులపైనే అక్రమ కేసులు బనాయించడం పరిపాటిగా మారిందన్నారు. న్యాయవాది మృతికి బాధ్యత వహిస్తూ ప్రభుత్వం వెంటనే వారి కుటుంబ సభ్యులకు రూ. కోటి నష్ట పరిహారం చెల్లించాలని, భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండాప్రతి పోలీస్ స్టేషన్‌లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో భారత న్యాయవాదుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు టి.ఈశ్వర్, ఐఎఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆనంద్ కుమార్, న్యాయవాదులు నాగేశ్వర్ ఎం.రవిశంకర్, ఎం.వి.రమణ, టి.వి.రమణ, నిరంజన్, సుబ్బరాయుడు, కుష్ణుమా, వరలక్ష్మి, ఆర్.డి.ఆనంద్, ఇలియాస్‌బాషా, సయ్యద్ బాషా పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** అనంతపురంలో సీనియర్ అడ్వకేట్ శేషాద్రి మృతికి తంబళ్లపల్లె బార్ అసోసియేషన్ సభ్యులు సంతాపం తెలిపారు. త్రీ టౌన్ సిఐ, పోలీసుల వేధింపుల వల్లే న్యాయవాది శేషాద్రి మృతి చెందాడని ఆరోపించారు. సివిల్ కేసులో లిఖితపూర్వక ఫిర్యాదు లేకుండానే శేషాద్రిని స్టేషన్‌కు పిలిపించి వేధించడాన్ని తీవ్రంగా ఖండించారు. త్రీ టౌన్ సిఐ, సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో న్యాయవాదులు లింగారెడ్డి, అరుణ్ కుమార్, నాగమల్లిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, గఫూర్ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు



ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలను ప్రదర్శిస్తున్న అధికారులు

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యకరం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యకరమని మండల వ్యవసాయ శాఖ అధికారి జి.సుధాకర్ పేర్కొన్నారు. ఎఒ, ఎపిఎం వసుంధర ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌ఛార్జి ఎం.సుబ్బరాయుడుతో కలిసి మండల పరిషత్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ కూరగాయల ఉత్పత్తులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లా డుతూ ప్రకృతి వ్యవసా యంతో పండించిన కూరగాయలు తినడం ద్వారా ఆరోగ్యం బాగుం టుందని, ఎటువంటి జబ్బులు రావని అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ పద్ధతిని పాటించి మన ఆరోగ్యాన్ని మనం కాపాడుకోవాలని పేర్కొన్నారు. వెలుగు ఎపిఎం వసుంధర మాట్లాడుతూ మహిళా సంఘాల ద్వారా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నామని ప్రతి ఒక్కరి పొలం నుంచి కూరలు పంపిస్తామని తెలిపారు. యూనిట్ ఇన్‌ఛార్జి సుబ్బరాయుడు మాట్లా డుతూ ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు రావడం, వాటికి మంచి గిరాకీ కూడా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఐసిఆర్‌పి గోవిందు, రైతులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలకు కఠిన ఆంక్షలు : సిఐ

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని పలు గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలకు కఠిన ఆంక్షలు విధిస్తు న్నట్లు కలకడ సిఐ గురునాథ్ తెలి పారు. న్యూ ఇయర్ వేడుకలను కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవాలని కె.విపల్లి మండలాల ప్రజలకు సూచించారు. మంగళవారం రాత్రి 9 గంటల నుంచి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తామని, పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని తల్లిదండ్రులకు సూచించారు. బహిరంగంగా డిజెలకు అనుమతి లేదని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చ రించారు. **మదనపల్లె అర్బన్ :** మంగళవారం రాత్రి నూతన సంవత్సర వేడుకలను రోడ్లపై నిర్వహించుకోవడాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించినట్లు మదనపల్లె వన్ టౌన్ సిఐ ఎరిషావల్లి తెలిపారు. 2025 కొత్త సంవత్సర వేడుకల సంబరాల్లో కేకులు కట్ చేయడం, రోడ్లపైన మద్యం తాగడం వంటివి వాటిపై నిషేదం ఉందని, వాటిని కేవలం ఇళ్లకే పరిమితం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా బైకులపై ఫీట్లు చేయడం, శృతి మించిన శబ్దాలు చేయడం, డిజెలు చట్టరీత్యా నేరమన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠినమైన చర్యలు తప్ప వని కేసులు నమోదు చేసి అరెస్టు చేయాల్సి వస్తుందనిహెచ్చరించారు. పట్టణ ప్రజలు ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. **రామసముద్రం :** నూతన సంవత్సర వేడుకల్లో యువత తప్పుదోవ పట్టకుండా కట్టుదిట్టమైన ఆంక్షలు విధించినట్లు ఎస్ఐ వెంకట సుబ్బయ్య తెలిపారు. మండలంలోని గ్రామాల్లో డిసెంబర్ 31వ తేదీ అర్ధరాత్రి తర్వాత న్యూ ఇయర్ వేడుకలను కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవాలని ప్రజలకు సూచించారు.

నేడు డీలర్ల నియామకం కోసం ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని ఖాళీగా ఉన్న డీలర్ పోస్టులకు మంగళ వారం ఇంటర్వ్యూలు జరుగు తాయని రాత పరీక్ష రాసిన వారు వెంటనే తప్పకుండా హాజరు కావా లని తహశీల్దార్ దైవాదీనం పేర్కొ న్నారు. డీలర్ల నియామకం కోసం రాత పరీక్షల్లో పాల్గొని ఉత్తీర్ణులైన వారు రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు. రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియాదేవి ఆధ్వర్యంలో ఈ ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. హాజరయ్యే వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకెళ్లాలని చెప్పారు.



ఎస్‌సి, ఎస్‌టి చట్టాలపై అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్, ఎంపిడిఒ

ఎస్‌సి, ఎస్‌టి చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- కలకడ

ఎస్‌సి, ఎస్‌టి చట్టాలపై అవగాహన అవసరమని తహశీల్దార్ ఫణి కుమార్ పేర్కొన్నారు. మండలంలోని ఏనుగొండపాలెం పంచాయతీ బండమీదపల్లి ఎస్‌సి కాలనీలో సివిల్ రైట్స్ డేని తహశీల్దార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో తహసిల్దార్, ఎంపిడిఒ అబ్దుల్ రహీం మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించి గ్రామంలో ఉన్న అసమానతలను, వివక్షతను తొలగించాలన్న ఉద్దేశంతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.చట్టం ముందు అందరూ సమానమేనని ఎస్‌సి, ఎస్‌టి ప్రజలను ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే వారు ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు మాట్లాడుతూ జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసు మేరకు ప్రతి నెల చివరి వారంలో సివిల్ రైట్స్‌డే జరపాలని కమిషన్ చెబుతుందని అన్నారు .సంబంధిత మండల స్థాయి అధికారులు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ నివారణ కొరకు కృషి చేయాలని, బండమీదపల్లి ఎస్‌సి కాలనీ వాసులకు శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కోరారు. ఈ గ్రామంలో ఎస్‌సి ప్రజలు వ్యవసాయ భూములకు వెళ్లాలంటే కొంతమంది అగ్రవర్ణాల వారు దారి ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని దారి సౌకర్యం కల్పించాలని కోరారు. సమావేశం అనంతరం కదరాచెరువులో కటింగ్ షాపుల్లో ఎస్‌సి,ఎస్‌టిలకు కటింగ్ చేయకపోవడంతో ఆ గ్రామాన్ని సందర్శించి ఎస్‌సి,ఎస్‌టి ప్రజలకు కటింగ్ చేయకపోతే చట్టపరమైన చర్యలు తీసుకొని జైలుకు పంపుతామని కటింగ్ షాపు యజమానులకు హెచ్చరించారు.కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు బండ కింద మనోహర్, సత్యాల రామకృష్ణ, మాజీ సర్పంచ్ విశ్వనాథ శెట్టి, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ కమలనాథ, పంచాయతీరాజ్ ఎఇ సాగర్, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, విఆర్‌ఒ రామకృష్ణ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఫార్మసిస్ట్ శివమ్మ సేవలు అమూల్యమైనవి

ప్రజాశక్తి-బి.కొత్తకోట : పట్టణంలోని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో గ్రేడ్ వన్ మెడికల్ ఫార్మసిస్ట్ విధులు నిర్వహిస్తూ శివమ్మ ఉద్యోగ విరమణ పొందారు. సోమవారం ఆమెకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. డాక్టర్ కిరణ్, డాక్టర్ అరీఫుల్లా, డాక్టర్ హసీనా, దంత వైద్యులు డాక్టర్ నర్సారెడ్డి, ఆసుపత్రి సిబ్బంది శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఫార్మసిస్టుగా శివమ్మ సమర్ధవంతంగా విధులు నిర్వహించారని అన్నారు. అంకితభావంతో పనిచేసే ప్రజలలో మంచి పేరు సంపాదిం చుకున్నారని తెలిపారు. శివమ్మ తన శేషజీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని వారు ఆకాంక్షించారు.

నూతన సంవత్సర వేడుకలకు.. హార్సిలీహిల్స్‌లో పటిష్టమైన ఏర్పాట్లు

- డిఎస్‌పి కొండయ్యనాయుడు

పజాశక్తి-బి.కొత్తకోట

2025 నూతన సంవత్సరం వేడుకలను పురస్కరించుకొని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సీలిహిల్స్‌లో పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు మదనపల్లి డిఎస్‌పి కొండయ్య నాయుడు, సిఐ జీవన్ గంగానాథ్‌బాబు తెలిపారు. మంగళ, బుధవారాల్లో రాత్రి వరకు హార్సీలీహిల్స్ పైకి ద్విచక్ర వాహనాలకు అనుమతి లేదన్నారు. ఈచర్లు, ఆటోలు, బొలెరో తదితర వాహనాలను కిందనే పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. కేవలం కార్లకు మాత్రమే అనుమతి ఉందన్నారు. పర్యాటకుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆర్‌టిసి అధికారులతో సంప్రదించడం జరిగిందని, డిపో మేనేజర్ 32 బస్సులను ఏర్పాటు చేశారని తెలిపారు. మదనపల్లి డివిజన్ పరిధిలోని పర్యాటకులు, సుదూర ప్రాంతాల నుండి వచ్చే పర్యాటకులు ఆర్‌టిసి బస్సులను సద్వినియోగం చేసుకోవాల న్నారు. ఇక మద్యాన్ని తీసుకెళ్లడానికి అనుమతులు లేవన్నారు. కొండపైనే ప్రభుత్వం ఏర్పాటు చేసిన మద్యం దుకాణాల్లోనే మద్యం కొనుగోలు చేసుకోవాలని తెలిపారు. డిజె, ఒపెన్ ఎయిర్ మ్యూజిక్‌లకు అనుమతులు లేవన్నారు. కొండపైన కూడా ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ప్రత్యేక పార్కింగ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



భద్రత ఏర్పాటును తనిఖీ చేస్తున్న సిఐ జీవన్ గంగానాథ్‌బాబు

ప్రత్యేక సర్వీసులు : ఆర్‌టిసి డిపో మేనేజర్

నూతన సంవత్సరాన్ని పురస్క రించుకొని మదనపల్లి -1 డిపో నుంచి మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌కు ప్రత్యేకంగా12 ఆర్‌టిసి బస్సులు నడుపుతున్నామని డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. బి.కొత్త కోట నుంచి హార్సిలీహిల్స్‌కు 4 బస్సులు, కాండ్లమడుగు క్రాస్ నుంచి హార్సిలీహిల్స్ కు 10 బస్సులు, తంబ ళ్లపల్లె నుంచి మల్లయకొండకు 6 బస్సులు నడుపుతున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సైన్స్ మేళాతో విద్యార్థులకు విజ్ఞానం : ఎంఇఒ



తంబళ్లపల్లి : విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలిస్తున్న ఎంఇఒలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

సైన్స్ మేళాతో విద్యార్థులకు విజ్ఞానం పెరుగుతుందని ఎంఇఒలు త్యాగరాజు, నాగ సుబ్బరాయుడు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ మేళా నిర్వహించారు. మండల స్థాయి సైన్సు మేళాలో ఎనిమిది పాఠశాలల నుంచి విద్యార్థులు తాము చేసిన ప్రయోగాలను ప్రదర్శించారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు మంగళవారం జిల్లా స్థాయి సైన్స్‌మేళాలో పాల్గొంటారని తెలిపారు. జిల్లా స్థాయి సైన్స్ మేళాకు ఇండివిజువల్ ప్రాజెక్ట్ తరపున మహాత్మా జ్యోతిరావు పూలే బిసి పాఠశాల, థర్డ్ ఐ బ్లైండ్ ప్రాజెక్టుకు ఎస్.శేషాద్రి, గ్రూప్ ప్రాజెక్ట్ తరపున వేస్ట్ టు ఎనర్జీ ఎగ్జిబిట్‌కు ఉన్నత పాఠశాల, కన్నెమడుగులో కె.వర్షిత, ఒ.దీపిక ఎంపికయ్యారు. సైన్సు మేళాలో పాల్గొన్న విద్యార్థులకు ఎంఇఒలు బహుమతులు ప్రదానం చేశారు. గైడ్ టీచర్లు నాగలక్ష్మి, యల్ఎన్ శాస్త్రి, ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాస్, సైన్సు గైడ్ టీచర్లు, పాఠశాల చైర్మన్ ఎన్.శ్రీనివాసులు, సిఆర్‌పిలు సుధాకర్, బాలకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు. **సుండుపల్లె :** మండలంలోని జడ్‌పి హైస్కూల్‌లో యుపి పాఠశాలల విద్యార్థులకు సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. సైన్స్ ప్రయో గాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన ఎంఇఒ రవీంద్రనాయక్ చేతుల మీదుగా బహుమతులను అందించినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మండలంలోని అన్ని జడ్‌పి, యుపి పాఠశాలల్లో 8వ తరగతి నుంచి 10వ పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు జ్ఞానాన్ని సంపాదిం చుకోవాలని ఉద్దేశంతోనే ఇలాంటి పోటీలు విద్యార్థులకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం ఎంఇఒ వెంకటేశ్వర్లు నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక విద్యపై అవగాహన పెంచుకోవాలన్నారు. నూతన ఆవిష్కరణలవైపు ఆలోంచి విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ఎగ్జామ్స్ ప్యాడ్, పెన్నులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సుండుపల్లి : విద్యార్థులకు విద్యా సామగ్రి అందిస్తున్న ఎంఇఒ

పశువులు, కోళ్ల పెంపకంపై అవగాహన



రైతులకు వ్యవసాయ ఉపకరణాలు అందిస్తున్న మంజుల

ప్రజాశక్తి-కలికిరి

పశువులు, కోళ్ల పెంపకంలో మెలకువలపై రైతులకు శిక్షణ కార్యక్రమం సోమ వారం కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. కెవికె సమన్వయకర్త డాక్టర్ కె.మంజుల మాట్లాడుతూ జిల్లాలో దాదాపు ప్రతి రైతు వ్యవసాయంతో పాటు పాడి సంపద కూడా కలిగి ఉండడం సంతోషదాయకమని అన్నారు. కెవికెలో సమీకృత వ్యవసాయ విధానాన్ని నమూనా పద్ధతిలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డాక్టర్‌నవీన పశువైద్య శాస్త్రవేత్త మాట్లాడుతూ పాడి కోళ్ల పెంపకంలో శాస్త్రీయ పద్ధతులను పాటించడం వలన వ్యాధి వృద్ధుని తగ్గించి అధిక లాభాలు గడించవచ్చుని అన్నారు. సమయానుకూల టీకాలను వేయించాలని తెలిపారు. వీటితోపాటు సమతుల్యమైన ఆహారం అందించడం ద్వారా పోషక లోపాల వలన వాటిలో నష్టాలను అరికట్టవచ్చుని తెలిపారు. అనంతరం రైతుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. చివరగా గ్రామ ప్రియ కోళ్లను, టార్పాలిక్ పట్టలు, డ్రమ్ములు వ్యవసాయానికి ఉపయోగపడే వస్తువులను ఎస్‌సి ఉప ప్రణాళిక కింద రైతులకు అందించారు. ఈ కార్యక్రమానికి కెవికె సిబ్బంది, మరికుంటపల్లి, అండే కురపల్లి, ముడియంవారిపల్లి, బాలెంవారిపల్లి రైతులు, మహానంది వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

శరవేగంగా పుల్లగూర గండి బ్రిడ్జి పనులు

- గతంలో ఇరుకు కాజ్‌వేతో ఇబ్బందులు
- పూర్తి కావస్తున్న నూతన లోలెవెల్ కాజ్‌వే పనులు
- దిన్నెపాటి హరినాథ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న ప్రజలు



పూర్తి కావచ్చిన పుల్లగూర గండి లోలెవెల్ కాజ్‌వే



జోరుగా జరుగుతున్న కాజ్‌వే నిర్మాణ పనులు

ప్రజాశక్తి-వీరబల్లి

మండల పరిధిలోని పుల్లగూర గండి బ్రిడ్జి లోలెవెల్ కాజ్‌వే పనులు శరవేగంగా సాగుతున్నాయి. మండలంలోని డి. రాచపల్లి పంచాయతీ పుల్లగూర గండి మాండవ్య నది పైన నిర్మిస్తున్న ఓబులేశ్వరస్వామి కన్స్ట్రక్షన్స్ అధినేత స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్ దిన్నేపాటి హరినాథ్‌రెడ్డి, నాగూర్‌రెడ్డి ఆధ్వర్యంలో బ్రిడ్జి పనులు జోరుగా సాగుతున్నాయి. వంగిమళ్ళ, డి,రాచపల్లి, కోట్రస్, ఉప్పరపల్లి, వనంకాడపల్లి, టెంకాయ చెట్లపల్లి, కావలిగడ్డ, నాగిరెడ్డిపల్లి, పెద్ద మాది పల్లి, పెద్దూరు కస్పా, రాచపల్లి, బలిజపల్లి, గుట్ట కింద, కళ్ళేవాళ్ళపల్లి గ్రామాల ప్రజలు మండల హెడ్ క్వాటకర్‌కు వీరబల్లికి పోవాలంటే ప్రజలు చాలా ఇబ్బంది పడేవారు. గత వైసిపి ప్రభుత్వంలో కురిసిన వర్షాలకి రోడ్లు కొట్టకపోయినాయి. లో లెవెల్ కాజ్‌వే నిర్మాణానికి రూ.7 కోట్ల 85 లక్షలతో భూమి పూజ చేశారు. జులై 15న మొదలుపెట్టి కూటమి ప్రభుత్వంలో పనులు జోరుగా సాగుతున్నాయి. కావలసిన ఇనుము, సిమెంటు, ఇసుక, మెటల్, తదితర సామగ్రిని గుత్తేదారుడు దిన్నపాటి హరినాథ్‌రెడ్డి సమకూర్చారు. రాత్రి పగలు తేడా లేకుండా పనులు సాగుతున్నాయి. కాజ్‌వే పనులు పూర్తయ్యాయి. ఒక నెలలో కాజ్‌వే ప్రారంభిస్తారు. ఈ కాజ్‌వే పనులతో పుల్లగూర గండి క్షేత్రం రూపురేఖలు మారిపోయి ఒక టూరిజం లాగా తయారవుతుందని ప్రజలు తెలుపుతున్నారు. అంతేకాకుండా కాజ్‌వే పనులను క్వాలిటీ కంట్రోల్ వారు పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. త్వరగా కాజ్‌వే పనులు పూర్తి చేసిన హరినాథ్‌రెడ్డికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కాజ్‌వేకు సహకరించిన రిటైర్డ్ ఎస్ఇ జయరామిరెడ్డి, ఎస్ఇ చంద్రశేఖర్, ఇఇ సహదేవరెడ్డి, డిఇ వెంకటసుబ్బయ్య, ఇఇ ధర్మారెడ్డి, రెండు గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేసి వారికి కృతజ్ఞతలు తెలిపారు. పుణ్యక్షేత్రమైన పుల్లగూర గండిలో ఆంజనేయ స్వామి దేవాలయం కట్టిస్తామని హరినాథ్‌రెడ్డి, నాగూర్‌రెడ్డి హామీనిచ్చారు.

ఓబులేశ్వర స్వామి కన్స్ట్రక్షన్‌కు రుణపడి ఉంటాం

లోలెవెల్ కాజ్‌వే బ్రిడ్జిని పూర్తవుతున్న సందర్భంగా వంగిమళ్ల గ్రామ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఇక ప్రయాణం సురక్షితంగా ఉంటుందని ఓబులేశ్వర స్వామి కన్స్ట్రక్షన్ రుణపడి ఉంటామని తెలిపారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం జరగాల్సిన మండల సమావేశానికి వైసిపి వైస్ ఎంపిపిలు, కో-ఆప్షన్ సభ్యులు, ఎంపిటిసిలు, సర్పంచులు, గైరహా జరయ్యారు. దీంతో మండల సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపిడిఒ ఉపేందర్ రెడ్డి తెలిపారు. మండల సమావేశాన్ని జరగనివ్వకుండా అడ్డుకోవాలని ముందస్తు ప్రణా ళిక ప్రకారం కూటమి నాయకులు ఉదయమే ఎంపిడిఒ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. కార్యాలయం ఎదుట బైటాయించి నినాదాలు చేశారు. అవాంఛనీయ సంఘ టనలు జగరకుండా ముందస్తుగా ఎస్ఐ లోకేశ్వర్‌రెడ్డి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న టిడిపి నాయకులు

విద్యుత్ సంక్షోభానికి జగనే కారణం : 'సుగవాసి'

ప్రజాశక్తి-రాయచోటి

రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభానికి కారణం మాజీ ముఖ్యమంత్రి వై ఎస్.జగన్‌మోహన్‌రెడ్డినేనని రాజంపేట టిడిపి ఇన్‌ఛార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం రాయచోటిలోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం మాట్లాడుతూ రాజకీయ మనుగడకు సంక్షోభం ఏర్పడుతుందని జగన్ ఆదేశాలు ఇవ్వడంతో రాష్ట్రంలో ప్రతి కలెక్టరేట్ కార్యాలయాల వద్ద వైసిపి నాయకులు ధర్నాలు చేయడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్రంలో విద్యుత్ వ్యవస్థ సంక్షోభంలో పడటం మీ నాయకుడి ప్రవర్తన వల్ల కాదా అని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు అకేపాటి అమర్నాథ్ రెడ్డి లను ప్రశ్నించారు. 2014వ సంవత్సరంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రారంభంలో 2కోట్ల 25 లక్షల యూనిట్ల లోటు విద్యుత్ ఉండేదన్నారు. అనంతరం 2019వ సంవత్సరంలో చంద్రబాబు పాలన ముగిసే సమయానికి మిగులు విద్యుత్‌ను ఉంచడం జరిగిందన్నారు. ప్రస్తుతం విద్యుత్ సం క్షోభంలో పడిందన్నారు. గడిచిన 5 సంవత్సరాల లో 10 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై 32 వేల కోట్లు భారం వేశారన్నారు.విద్యుత్ కొరతను సృష్టించి కొనుగోలు పరంగా లాభాలు పొందింది మీరు కాదా అన్ని పశ్నించారు. రాష్ట్ర ప్రజలకు జగన్ మోహన్ రెడ్డి క్షమాపణ చెప్పాలన్నారు. రాష్ట్రంలో లక్షా 29 వేల కోట్ల విద్యుత్ బారాలు పడ్డాయన్నారు. రాష్ట్రంలో ఒక్క విద్యుత్ ప్రాజెక్టు కట్టారా అని ప్రశ్నించారు.



బాధితుడికి చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, వరలక్ష్మి

పేదలకు వరం సిఎం సహాయనిధి

ప్రజాశక్తి-పుల్లంపేట

సిఎం సహాయనిధి పేదలకు వరంలాంటిదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని వైకోట గ్రామానికి చెందిన శ్రీరామ ప్రేషకిల్లా అనే బాధితుడికి సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ.11.50 లక్షల చెక్కును కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మితో కలిసి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వ సహాయం అందించడంలో సంతృప్తిగా ఉందని ఆపన్నులను ఆదుకోవడం మా బాధ్యత అని అన్నారు. తీవ్ర అనారోగ్యానికి గురై పేదలకు సత్వర సహాయం అందించడంలో నిర్విరామ కృషి చేస్తున్నామని అన్నారు. సిఎం సహాయ నిధి ద్వారా నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పేదలకు ఆర్థిక సాయం అందించడం కోసం సమర్ధవంతమైన ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన విద్యార్థులు జతిన్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి

జాతీయ స్థాయిలో జతిన్‌రెడ్డికి బంగారు పతకం

ప్రజాశక్తి-రామాపురం

జాతీయస్థాయి ఫోర్త్ రోల్ బాస్కెట్‌బాల్ పోటీల్లో మండలానికి చెందిన నాగిెండ్డి జతిన్‌రెడ్డి గోల్డ్ మెడల్ సాధించినట్లు కోచ్ కార్తీక్‌రెడ్డి తెలిపారు. చిట్లూరు పంచా యతీ, ఏకిలపల్లికి చెందిన జతిన్‌రెడ్డి తిరుపతి క్యాండూర్ స్కూల్లో చదువుతూ నాగ పూర్‌లో జరిగిన అండర్-14 ఫోర్త్‌రోల్ బాస్కెట్ బాల్ విభాగంలో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించాడని తెలిపారు. అండర్-11 విభాగంలో నాగిరెడ్డి హన్షిత్‌రెడ్డి బ్రోంజ్ మెడల్ సాధించాడని చెప్పారు. తన ఇద్దరు కుమారులు జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం పట్ల వారి తండ్రి నాగిరెడ్డి దేవదర్శన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని ఎస్‌బివిడి సభ జూనియర్ కళాశాలలో సోమవారం డాక్టర్ అగర్వాల్ ఐ ఆస్పత్రి తిరుపతి వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించినట్లు ప్రిన్సిపల్ అద్దేపల్లి బాలాజీరాజు తెలిపారు. ఈ కేంద్రంలో విద్యార్థులకు కంటి విజన్ స్క్రీన్, కంటి పరీక్ష నిర్వహించి ఎవరికైతే దృష్టిలోపం ఉందో వారికి ఒక జత కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేస్తామని డాక్టర్ అగర్వాల్ చెప్పారు. కంటి ఆరోగ్యం గురించి, కంటి రక్షణ గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు కల్పించారు. ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించిన డాక్టర్ అగర్వాల్ ఐ ఆస్పత్రి సేవలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. బాల్యం నుంచే దృష్టిలోపం సరే దిద్దడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు బాగుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.




కంటి పరీక్ష చేయించుకుంటున్న విద్యార్థిని

రామసముద్రంలో దుప్పి సంచారం

ప్రజాశక్తి-రామసముద్రం

మండల కేంద్రం రామసముద్రం దిగుపేట సమీపంలో సోమవారం దుప్పి ప్రత్యక్షమయ్యింది. దుప్పి వెంట కుక్కలు వెంటపడటంతో పక్కనే ఉన్న ముళ్ల పొదల్లోకి పరుగులు తీసింది. గమనించిన స్థానికులు దుప్పిని కాపాడేందుకు అటవీ సిబ్బందికి సమాచారం అందించారు. అటవీశాఖ సిబ్బంది వచ్చేలోపు అది తప్పిచుకుపోయి అడ్డ కొండ అటవీ ప్రాంతం వైపు వెళ్లిపోయింది.



జనావాసాల్లో సంచరిస్తున్న దుప్పి

క్రైం కార్నర్

ట్రాక్టర్ బోల్తా : తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

రోడ్డుపై ప్రయాణిస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిన సంఘటన నిమ్మనపల్లి మండలంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... ఆదివారం సాయంత్రం మండలంలోని పారేసువారిపల్లెకు చెందిన ట్రాక్టర్ యజమాని మనోహర్ నిమ్మనపల్లి వైపు నుంచి ముష్టూరు, వలసపల్లె వైపు తన ట్రాక్టర్ నడుపుకుంటూ వెళుతుండగా కొమ్మిరెడ్డిగారిపల్లె సమీపంలోని బహుదా నదిపై ఉన్న కల్వర్టుపై ట్రాక్టర్ అదుపుతప్పి నదిలో బోల్తా పడిందన్నారు. ట్రాక్టర్ నడుపుతున్న మనోహర్ అదృష్టవశాత్తు క్షేమంగా బయటపడ్డారని తెలిపారు. ఇదిలా ఉండగా నాలుగేళ్ల క్రితం తుపాను కారణంగా వరదలతో బహుదా నదిపై ఉన్న కల్వర్టు పూర్తిగా దెబ్బతిని, వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నాదని అన్నారు. ఎత్తైన వంతెన నిర్మించడానికి ఆర్‌అండ్‌బి అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా, సమస్యపై పత్రికల్లో వెలువడిన అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. ఆర్‌అండ్‌బి అధికారులు తాత్కాలికంగా కల్వర్టు దెబ్బతిన్న ప్రాంతంలో రాళ్లు, మట్టి తోలడం వంటి నామమాత్రపు పనులు చేస్తున్నారని చెప్పారు. నిమ్మనపల్లి నుంచి వాల్మీకిపురం వెళ్లడానికి ప్రధాన మార్గం ఇదేనని, ఇప్పటికైనా ఆర్‌అండ్‌బి అధికారులు ఇక్కడ ఎత్తైన వంతెన నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బస్సు, లారీ ఢీ : ట్రాఫిక్‌కు అంతరాయం

ప్రజాశక్తి-నందలూరు

మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో బస్సు, లారీ ఢీకొన్న సంఘటనలో ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. రాజంపేట నుంచి కడప వైపుకు వెళ్తున్న ఆర్‌టిసి బస్సు, కడప నుంచి రాజంపేట వైపు వెళ్తున్న వస్తువులను రవాణా చేసే లారీ వెడల్పు కన్నా అందులోని వస్తువులు బయటికి ఉండడంతో ఎదురుగా వస్తున్న వాహనాల వెలుతురు కారణంగా లారీలోని బయటికి వచ్చిన వస్తువులు కనబడకపోవడంతో సోమవారం రాత్రి బస్సు ఢీకొంది. ఈ సంఘటనలో బస్సు అద్దాలు పగిలాయి. బస్సు డ్రైవర్ అప్రమత్తమై బ్రేకులు వేయడంతో ప్రయాణికులు ప్రమాదం బారి నుంచి బయటపడ్డారు. ఈ సంఘటన వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడడంతో స్థానిక పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరించి ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.